మళ్లీ వచ్చేది కేసీఆర్ పాలనే..

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- వడూర్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా
- రూ.51లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ

నేరడిగొండ: షెడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జనవరి 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలోనే అనేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు, రైతులు మళ్లీ కేసీఆర్ పాలనే రావాలని కోరుకుంటున్నారని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. ప్రజలను పట్టించుకున్నవారు కరువయ్యారని విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను బోల్తా కొట్టించారని మండిపడ్డారు. రుణమాఫీ, రైతు భరోసా లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడూర్ గ్రామం నుంచి నా రాజకీయ మొదటి అడుగు ప్రారంభమైందని అన్నారు. వడూర్ గ్రామంలో రూ.51 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ముందుగా గ్రామంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శివారెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గాదె శంకర్, వడూర్ వీడీసీ చైర్మన్ సంతోష్, మాజీ జడ్పీటీసీ పండరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు ఉప్పు పోశెట్టి, రాములు, శ్రీకాంత్, ఫయాజ్, భూషణ్, నవీన్, రవీందర్, కార్తీక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తీర్థ ప్రసాదాలు అందజేత

బోథ్, జనవరి 24: బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ మెడిచెల్మ ప్రవీణ్ శబరిమల నుంచి తీసుకొచ్చిన అన్న ప్రసాదాలు శుక్రవారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు అందజేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని వేడుకున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, సెక్రటరీ నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 24: గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. సిరికొండ మండలంలోని సుంకిడి గ్రామంలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి, రూ.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, రూ. కోటి 20 లక్షలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పాండుగూడ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఇచ్చోడ, జనవరి 24: క్రీడల్లో గెలుపోటములు సహజమని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఇచ్చోడ మండలం దాబా(కే) గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. అంబేద్కర్ భవనం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో యువకులు నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపునకు హాజరై గెలుపొందిన జట్లకు ఎమ్మెల్యే సొంత డబ్బులు రూ.25 వేల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏడు అడవి పందులు స్వాధీనం

వేటగాళ్లను అదుపులోకి తీసుకున్న అటవీ శాఖ అధికారులు

భైంసా, జనవరి 24 : నిర్మల్ జిల్లా భైంసా లోని మిషన్ భగీరథ సమీపంలో అక్రమంగా బంధించిన ఏడు అడవి పందులను శుక్రవారం అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అటవీ శాఖ భైంసా అధికారి శంకర్ మాట్లాడుతూ పక్కా సమాచారం మేరకు గుర్తించి అడవి పందులను స్వాధీనం చేసుకొని ఎనిమిది మంది వేటగాళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆయన వెంట అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

నెమలి అప్పగింత

ఇచ్చోడ, జనవరి 24 : కామగిరిలో జాతీయ పక్షి నెమలి దారి తప్పి గ్రామానికి వచ్చింది. గమనించిన మాజీ సర్పంచ్ తొడసం భీంరావ్ అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో బీట్ ఆఫీసర్ జాదవ్ నౌసిలాల్ గ్రామానికి రాగా నెమలిని అప్పగించారు. దానిని బోథ్ అర్బన్ పార్కులో విడిచిపెట్టారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

గ్రామసభలు గరం..గరం

- జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని అధికారులతో ప్రజల వాగ్వాదం
- అర్హులకు అన్యాయం జరుగుతుందని ఆగ్రహం

కుంటాల: అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

గుడిహత్నూర్: కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం

దిలావర్‌పూర్: గుండంపల్లిలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

లోకేశ్వరం, జనవరి 24 : నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని పుస్పూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభ గరంగరంగా సాగింది. అధికారులు వెల్లడించిన జాబితాలో అనర్హుల పేర్లు ఉండడంతో ప్రజలు నిలదీశారు. ఇండ్లు ఉన్నోళ్లకే మళ్లీ ఇచ్చారని, భూములున్నోళ్లనే ఆత్మీయ భరోసాకు ఎంపిక చేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులను ప్రశ్నించిన గ్రామస్తులు

కుంటాల, జనవరి 24 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని పెంచికల్‌పాడ్, కల్లూర్, కుంటాలలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. కుంటాలలో జరిగిన గ్రామసభలో సక్షేమ పథకాలు అర్హులకే ఇవ్వాలని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదని, రుణమాఫీ పూర్తి చేయలేదని, గతంలో ప్రజాపాలన కౌంటర్లలో దరఖాస్తులు సమర్పించిన మళ్లీ దరఖాస్తు చేయమని అడగడం ఏమిటని బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తు ప్రశ్నించారు. గ్రామంలో ప్రభుత్వం స్థలం లేకున్నా ఇందిరమ్మ ఇండ్లు ఎక్కడ కట్టిస్తారని పలువురు అధికారులను నిలదీశారు. ప్రభుత్వ స్థల సేకరణకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ వివరణ ఇచ్చారు. అర్హత ఉన్నప్పటికీ చాలా మంది పేర్లు లేవని, పాదర్శకతతో అర్హులను ఎంపిక చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ ఎంపీపీ గజ్జారాం, వెంకటేశ్, జక్కుల గజేందర్ కోరారు. డీపీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేసినట్టు, జాబితాలో పేర్లు రానివారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎజాజ్ ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, ఏఈవో హర్షిత, ఏపీవో నవీన్, కార్యదర్శి రాజబాపు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో ప్రజల వాగ్వాదం

ముథోల్, జనవరి, 24: నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఆష్టా, వడ్తాల్, చించాల, విట్టోలి గ్రామాల్లో అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేశారు. చించాలలో ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు రాలేదని గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తప్పనిసరిగా అర్హులకు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. అలాగే ఆష్టాలో అధికారులు సమయానికి రాకపోవడంతో వచ్చేవరకు గ్రామసభ జరగనివ్వమని గ్రామస్తులు వాపోయారు. వెంటనే ఎస్ఐ సంజీవ్ వారిని సముదాయించారు. అనంతరం అధికారులు గ్రామసభకు చేరుకొని యథావిదిగా నిర్వహించారు.

రసాభాసగా గ్రామసభ

బాసర, జనవరి 24 : నిర్మల్ జిల్లా బాసరలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా సాగింది. పథకాల లబ్ధిదారుల జాబితా చదవగానే ప్రజలకు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇండ్లు ఉన్నోళ్లకే మళ్లీ ఇచ్చారని, భూములున్నోళ్లకే ఆత్మీయ భరోసాకు ఎంపిక చేశారని మండిపడ్డారు. ఎంపీడీవో అశోక్‌కుమార్ వారిని సముదాయించారు. పేర్లు రానివారు దరఖాస్తులు చేసుకోవాలని, అర్హులకు పథకాలు అందించడం జరుగుతుందన్నారు.

నీలాయిపేట్ గ్రామసభలో నిలదీత

సోన్, జనవరి 24: నిర్మల్ మండలంలోని నీలాయిపేట్‌లో గ్రామసభ నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు పెట్టుకున్న వారి పేర్ల జాబితాను అధికారులు చదివి వినిపించారు. అర్హులైన వారికి కాకుండా అనర్హుల పేర్లు రావడంపై గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీ శారు. దీంతో అధికారులు జోక్యం చేసుకొని ఎవరి పేర్లు రాలేవో తమకు దరఖాస్తులు అందిస్తే తప్పకుండా న్యాయం చేస్తామని చెప్పడంతో తిరిగి గ్రామసభను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్, జనవరి 24: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లి, సముందర్‌పల్లి, దిలావర్‌పూర్ గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. గుండంపల్లిలో గ్రామానికి రేషన్‌కార్డులు ఎందుకు రాలేవని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. గతంలో గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వే జరుగలేదని అందుకే రేషన్‌కార్డులు రాలేదని అధికారులు ప్రజలకు వివరించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల జాబితాను చదివి వినిపించగా అర్హులకు కాకుండా అనర్హులకు వచ్చాయని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామసభ ముగిసినట్లు అధికారులు ప్రకటించారు. అదే విధంగా సముందర్‌పల్లి, దిలావర్‌పూర్ గ్రామాల్లో కూడ సమగ్ర కుటుంబ సర్వే జరుగనందున రేషన్‌కార్డుల జాబితా రాలేదని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్, ఈజీఎస్ఏపీవో దివ్యరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు స్వాతి, దిలీప్ పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన గ్రామస్తులు

నర్సాపూర్ (జీ), జనవరి, 24: నర్సాపూర్ (జీ)లోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు రాలేదని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో గందరగోళం నెలకొంది. జాబితాలో లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన సుదర్శన్ గౌడ్ ముంపునకు గురైన నర్సాపూర్ (జీ) గ్రామానికి ప్రత్యేకంగా ఇండ్లను మంజూరు చేయాలని దరఖాస్తులు అందించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో తిరుపతి రెడ్డి, సెక్రటరీ కైలాస్, ఉపాధి హామీ సిబ్బంది, మండల వ్యవసాయాధికారి రామచందర్ నాయక్ పాల్గొన్నారు.

పెండల్‌వాడలో వాగ్వాదం

జైనథ్, జనవరి 24: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని పెండల్‌వాడలో ప్రజాపాలన గ్రామభ నిర్వహించారు. గ్రామంలో మొత్తం 714 మందికి జాబ్ కార్డులుండగా అందులో ఆరుగురికి మాత్రమే ఆత్మీయ భరోసా పథకం కింద పేర్లు రావడంతో కూలీలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో మాజీ ఎంపీటీసీ కాసర్ల అశోక్ మాట్లాడుతూ పెండల్‌వాడలో రెండు వేల మంది బ్యాంకులో రైతు ఖాతాలుండగా అందులో కేవలం 1200 మంది రైతులకు రుణమాఫీ వచ్చిందని, మిగతా 800 మందికి రుణమాఫీ రాలేదన్నారు. ఇండ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఆరు గ్యారెంటీల హామీని ప్రభుత్వం విస్మరించిందన్నారు. అనంతరం అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి హరీశ్, ఏఈవో తౌసిఫ్, పంచాయతీ కార్యదర్శి సూరజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ

గుడిహత్నూర్, జనవరి 24 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని రైతు వేదికలో నిర్వహించిన గ్రామసభలో ప్రోటోకాల్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఫ్లెక్సీపై బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఫొటో లేకపోవడంతో నాయకులు అధికారులను అందిస్తే తప్పకుండా న్యాయం చేస్తామని చెప్పడంతో తిరిగి గ్రామసభను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్తుల ఆందోళన

బోథ్(తలమడుగు), జనవరి 24: ఆదిలాబాద్ జిల్లా తలమడుగులోని రైతు వేదికలో నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు ఆందోళన చేశారు. అర్హులైన వారి పేర్లు జాబితాలో లేవని, ఇప్పటికే రెండుసార్లు దరఖాస్తు చేసుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు జాబితాలో లేని వారి పేర్లను మళ్లీ దరఖాస్తు చేసుకోమంటే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కూడా గ్రామసభ ద్వారా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గజానన్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏఈఓ స్ఫూర్తి, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసుల బందోబస్తుతో ముగిసిన గ్రామసభలు

తాంసి, జనవరి 24: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని అట్నుంగూడ, లింగూడ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు. అధికారులు గ్రామస్తుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నాలుగు రోజులుగా చేపట్టిన గ్రామసభలు పోలీసుల బందోబస్తు మధ్య ముగిశాయి. గ్రామ సభల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రాధిక సిబ్బందితో కలిసి విధులు నిర్వహించారు.

రుణమాఫీ విజ్ఞాపనలు

భీంపూర్, జనవరి 24: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం భగవాన్‌పురా, జలకొరి, కరణ్‌వాడి, కైరిగూడ, టేకిడిరాంపూర్, వడ్‌గాం, వడూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో ప్రధానంగా రుణమాఫీ అంశంపై లేవనెత్తారు. రైతులు అధికారులకు దరఖాస్తులు సమర్పించారు. ఈ నాలుగు పథకాల అమలుపై కూడా విశ్వాసం లేదన్నారు. ఫ్లెక్సీలపై ఎమ్మెల్యే, ఎంపీల ఫొటోలు లేకపోవడంపై ప్రశ్నించారు. మండలం మొత్తంగా 125 ఎకరాల భూమి సాగుకు యోగ్యం లేదని అధికారులు ధృవీకరించారు. సభలో ప్రత్యేకాధికారి కిషన్, తహసీల్దార్ నలందప్రియ, ఎంపీడీవో గోపాలకృష్ణరెడ్డి, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, డీటీ హరీశ్, ఆర్ఐ రాందాసు, ఏఈవోలు వికాల్, శంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలిక చదువుకుంటే సమాజం బాగు

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 24: బాలిక చదువుకుంటే కుటుంబమే కాదు సమాజం బాగుపడుతుందని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని రాంనగర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బ్యాండు మేళాతో అధికారులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు కుటుంబానికి వెలుగులు నింపే దీపాలన్నారు. బాలికలు జీవితంలో ఉన్నత స్థితిలో నిలిచేందుకు చిన్నతనం నుంచే ఉన్నత బాటలు వేసుకోవాలని తెలిపారు. బాలికలకు సరైన విద్యా అవకాశాలు కల్పిండం ప్రతి ఒక్కరి బాధ్యతని, వారిని కేవలం కుటుంబానికి పరిమితం కాకుండా సమాజ నిర్మాణంలో వారి పాత్రను గుర్తించడం మన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ , డీఈవో రామారావు, డీటీడీవో అంబాజీ, మెప్మా పీడీ సుభాష్, ఎంఈవో నాగేశ్వర్ రావు, ప్రధానోపాధ్యాయుడు తుకారాం, సీడబ్ల్యూసీ చైర్మన్ వహీద్, మిషన్ శక్తి సమన్వయకర్త సవిత, సీడీపీవోలు నాగమణి, సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి ప్రభాకర్ రావ్

బోథ్, జనవరి 24: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో నిర్మిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణ పనులను శుక్రవారం జిల్లా న్యాయమూర్తి ప్రభాకర్‌రావ్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపం లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం బోథ్‌కు వచ్చిన జిల్లా జడ్జికి స్థానిక ఇన్‌చార్జి న్యాయమూర్తి మౌనిక స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్‌పాండే, పీపీ శ్రీధర్, ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు మోహన్‌రావ్, సుభాష్, అంగద్‌కేంద్రె, హరీశ్, రుపేందర్ సింగ్, విజయ్, ధమ్మపాల్, జమీర్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కంప్యూటర్ ల్యాబ్ సేవలను ప్రారంభిస్తున్న వీసీ

బాసర, జనవరి 24 : నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం విద్యార్థుల కోసం కంప్యూటర్ ల్యాబ్ సేవలను ప్రారంభించారు. పీయూసీ విద్యార్థులకు అభ్యాస అనుభవాలను మెరుగు పరచడానికి విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా కంప్యూటర్ ల్యాబ్ సేవలను ప్రారంభించినట్లు వీసీ గోవర్ధన్ తెలిపారు. నేటి వేగవంతమైన ప్రపంచంలో డిజిటల్ అక్షరాస్యత విషయాలలో విజయం సాధించడానికి సాధ్యమైనంత ఉత్తమమైన వనరులను అందించడమే లక్ష్యమని అయన అన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ఐటీ అధికారులు, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

నార్నూర్, జనవరి 24 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాన్కాపూర్ గ్రామానికి చెందిన మహత్మే చంద్రకాంత్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం పురుగుల మందు తాగినట్లు సమాచారంతో చికిత్స కోసం ఆదిలాబాద్ దవాఖానకు తరిలించారు. పరిస్థితి విషమిం చడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తీసుకెళ్తుండగా మృతి చెందాడు. మృత్యుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జైనథ్, జనవరి 24 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కుస్నపెల్లి మహేశ్(23) గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహేశ్ ద్విచక్రవాహనంపై రాత్రి ఇంటి నుంచి జైనథ్ వెళ్లే మార్గంలో పిప్పల్‌గాం కెనాల్ సమీపంలో అతివేగంగా చెట్టును ఢీ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి గజానన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి శవ పంచనామా చేసినట్లు తెలిపారు.

యువకుడిపై కేసు

ఎదులాపురం, జనవరి 24: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి సమీపం వద్ద శుక్రవారం పరస్పర దాడి కేసులో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ముజాహిద్ తెలిపారు. సొతే కైలాస్(47)పై విఘ్నేశ్వర్ (33) దాడి చేసి చేసినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నేరడిగొండ, జనవరి 24 : ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని నేరడిగొండలోని సాయి చైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజ్ కిరణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అధ్యాపకులతో కలిసి నేరడిగొండలోని అంబేద్కర్, కుమ్రం భీం విగ్రహాలకు వినతి పత్రాలు అందజేసి నిరసన తెలిపారు. అనంతరంస్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శరత్, అధ్యాపకులు లింగన్న, ముకుంద్‌రావ్, రాజశేఖర్, రవి, దినేశ్, సాయి, అరవింద్ పాల్గొన్నారు.

వర్కర్లకు వేతనాలు చెల్లించాలి

ఉట్నూర్, జనవరి 24: గిరిజన ఆశ్రమాలలో విధులు నిర్వహిస్తున్న డెలివేజ్, ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైం, శానిటేషన్ వర్కర్లకు వేతనాలు చెల్లించాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు కేబీసీ నారాయణ శుక్రవారం ఉట్నూర్‌లో గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ భవన నిర్మాణానికి స్థలం పరిశీలన

నార్నూర్, జనవరి 24 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయం పక్కన ఇందిరమ్మ నమూనా భవన నిర్మాణానికి స్థలాన్ని శుక్రవారం ఎంపీడీవో జవహర్‌లాల్, ఐటీడీఏ ఏఈ రాథోడ్ సునీల్ పరిశీలించారు. రూ.5లక్షలతో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు వారు తెలిపారు. వారి వెంట ఈజీఎస్ ఈసీ రాథోడ్ సురేందర్ ఉన్నారు.

సర్వీస్ రోడ్డు మాకు కావాలి

నిర్మల్ అర్బన్, జనవరి 24: మా సర్వీస్ రోడ్డు మాకు కావాలని నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ గ్రామస్తులు అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని పెన్షనర్ల సంఘ భవనంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కడ్తాల్ అండర్ బ్రిడ్జి లేక ప్రమాదాలు జరుగుతున్నాయని, బ్రిడ్జి నిర్మాణంతో సర్వీస్ రోడ్డు గ్రామానికి లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ విషయంపై అధికారులను కలిసిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే సుప్రీం కోర్టుకు వెళ్తామన్నారు. మండలంలోని ప్రజలందరూ కలిసి రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు మల్లారెడ్డి, నూతన్ కుమార్, రాంలక్ష్మణ్, రాజు, కృష్ణవేణి పాల్గొన్నారు.

గ్రామ సభల్లోనే ఎంపిక చేయాలి

కుభీర్, జనవరి 24 : నిర్మల్ జిల్లా కుభీర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రెండో రోజూ గ్రామ సభ నిర్వహించారు. ఎంపిక చేయడానికే గ్రామ సభలు పెట్టారు. మాకు ఇంకేందుకు ప్రాధాన్యత ప్రకారం అంటున్నారు. ఎందరికి ఇండ్లు మంజూరయ్యాయి చెప్పండి అంటూ వాదించారు. అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో నిలదీశారు. దీంతో మాకు చదివి వినిపించామని చెప్పారు. మాదేముంది ప్రభుత్వం ఎలా చెబితే అలా నడుచుకోవాలి కాదా అంటూ చెప్పినట్లు తెలిపారు. దీంతో గ్రామస్తులు ప్రభుత్వంపై మండిపడ్డారు. పంచాయతీ కార్యదర్శిగా గౌతంను ఇన్‌చార్జిగా నియమించామని ఎంఈవో సభకు వివరించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీఓ మోహన్‌సింగ్, గ్రామస్తులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్ల దినోత్సవం

ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న అధికారులు

నిర్మల్ అర్బన్, జనవరి 24 : ఆర్టీసీ డ్రైవర్లలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే డ్రైవర్ల దినోత్సవాన